

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**"నా జాబ్ నెక్స్ట్ వీక్** నుండి స్టార్ట్" హనీష ఉదయాన కాఫీ తాగుతూ అంది.

"ఏం జాబ్?" అడిగాను.

"ఆన్ కేంపస్ జాబ్. టిఏ"

"దేనికి టి ఏ?"

"డేటా సైన్స్."

"ఈజీనా?"

"ఈజీయే. ఉత్త పేపర్స్ కరెక్ట్ చేస్తాను. టీచింగ్ కష్టం."

"ఎలా అప్లై చేసావు?"

"ఫస్ట్ సెమిస్టర్‌లో క్లాస్ తీసుకున్నా. గ్రేడ్ బాగా వచ్చింది. ప్రొఫెసర్‌తో మాట్లాడితే ఇచ్చారు"

"ఓ..ఓకే"

"టి ఏకి ఒక సెమిస్టర్ చదివాక గ్రేడ్ బట్టి ఇస్తారు. ఆర్ ఏ కూడా అంతే."

"ఆర్ ఏ అంటే?"

"రిసర్చ్ అసిస్టెంట్. కెఫెటేరియా, జిమ్‌లాంటివి ఫస్ట్ సెమిస్టర్‌లో వస్తాయి. కానీ రికమండేషన్ అవసరం. మనవాళ్ళు గ్రాడ్యుయేట్ అయ్యేముందు వేరే ఇండియన్‌ని రికమెండ్ చేసి వెళ్ళిపోతారు. అందరూ అప్లై చెయ్యచ్చుకానీ రికమెండేషన్ వాళ్ళకే ఇస్తారు. అప్లై చేసి వేస్ట్."

"ఓ. అయితే నేను నెక్స్ట్ సెమిస్టర్ ట్రై చెయ్యాలా?"

"యా. కావాలంటే అప్లై చేస్కో. లైబ్రరిలో పనిచేసే ఒకతను వెళ్ళిపోతున్నాడు. ఎవరినైనా రికమండ్ చేసాడేమో కనుక్కుంటా."

"సరే థాంక్స్"

"నువ్వు రెజ్యూమ్ రెడీ చేసి పెట్టుకో. అలానే మీ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్స్‌కి ఈ మెయిల్ చెయ్యి. ఇప్పుడు ఇవ్వకపోయినా, నెక్స్ట్ సెమిస్టర్ కి గుర్తుపెట్టుకుంటారు"

"సరే, అంతేచేస్తా" అన్నయ్య ఫోన్ రావడంతో ఆరు బయటకి వెళ్ళాను.

"హలో"

"ఎలా ఉంది? అలవాటైపోయిందా కొత్త ప్రదేశం?" అడిగాడు.

"అలవాటౌతూ ఉంది ఇంకా."

"అలా బయటకి వెళ్ళు. కేంపస్ అంతా నడిచి అలవాటు చేసుకో. నీ క్లాసులున్న బిల్డింగ్లన్నీ చూసుకో."

"సరే. ప్రొఫెసర్స్‌ని కలుస్తా"

"ఎందుకు?"

"ఉత్త పరిచయం చేసుకోడానికి"

"వాళ్ళేమన్నా నీ చుట్టాలా? వాళ్ళకి చాలా పనులుంటాయి. ఓరియంటేషన్‌లో నీ అడ్వైసర్‌ని కలుస్తావు. అప్పటివరకు ఆగు. ఒక వేళ నిజంగా మాట్లాడాల్సినది ఏదైనా ఉంటే అప్పుడు కలువు."

"సరే. నా ఫ్రెండ్ ప్రొఫెసర్స్ దగ్గర టిఏ, ఆర్ ఏ పోస్టులు ఏమైనా ఉన్నాయేమో కనుక్కోమంది. ఫస్ట్ సెమిస్టర్‌లో ఇవ్వరట. నెక్స్ట్ సెమిస్టర్‌కి ట్రై చేస్తాను"

"ఈ మెయిల్ చెయ్యి. సరిపోతుంది. లైబ్రరీలాంటి వాటిలో అప్లై చెయ్యి"

"చేసి వేస్ట్. ఆల్రెడీ ఎవరికి ఇవ్వాలో డిసైడ్ చేసేసారట."

"అప్లై చెయ్యడంలో తప్పులేదు. ముందు అవి చేసి తరవాత ప్రొఫెసర్లకి నీ రెజ్యూమే పంపు"

"సరే. అంతే చేస్తా."

"డిలే చెయ్యకు. రూం చూస్కున్నావా?"

"ఇంకా లేదు"

"అదికూడా డిలే చెయ్యకు. వెంటనే చూసుకో. తరవాత కష్టం."

"సరే."

"సరే... సరే కాదు. అన్నీ లిస్ట్ రాసుకుని టకటకా చెయ్యి పనులన్ని. క్లాస్ స్టార్ట్ అయ్యాక నీకు అస్సలు టైం ఉండదు. చాలా బిజీ అయిపోతావు"

"సరే ఫోన్ పెట్టాక అంతే చేస్తా"

"ఇంకేంటి?"

"చెప్పాలి"

"సరే.. ఏదైనా అవసరం వస్తే ఫోన్ చెయ్యి. ఉంటాను."

"ఓకే. బాయ్" ఫోన్ పెట్టి లాప్‌టాప్ తెరిచాను. మా డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ప్రొఫెసర్లకి ఈ మెయిల్‌లో నా రెజ్యూమే పంపి ఆన్ కాంపస్ జాబ్ కోసం చూస్తున్నా అని రాసాను. ఓ పని అయిపోయింది, హమ్మయ్య అని లాప్ టాప్ మూసేసరికి "ఆకలేస్తుందా?" అంటూ హనీష వచ్చింది.

"ఇంకాలేదు నీకు వేస్తుందా?" అడిగాను.

"లేదు. టైం రెండవుతోంది."

"అప్పుడే రెండా?" చెక్ చేస్తే మధ్యాహ్నం రెండు దాటింది.

"లైబ్రరీకి వెళ్దామా? తను ఉంటే నిన్ను రికమెండ్ చెయ్యమని చెప్తాను" అంది.

"సరే" అని లేచి చెప్పులు వేసుకున్నాను. ఇద్దరం కలిసి కాసేపు నిశ్శబ్దంగానే నడిచాము. అన్నయ్య చెప్పినట్టు నేను దారులు గుర్తుపెట్టుకోవాలనుకున్నాను.

"లైబ్రరి వెనకాల లెఫ్ట్ తిరగాలనుకున్నాను. నాకు రూట్స్ సరిగ్గా గుర్తుండవు" అన్నాను.

చిన్నగా నవ్వి "నీకు గుర్తున్న రూట్ కరెక్టే" మళ్ళీ నవ్వింది.

"వేరే రూట్‌లో వెళ్తున్నామా?"

"లేదు. మనం మ్యూజిక్ లైబ్రరీకి వెళ్తున్నాము."

"మ్యూజిక్ లైబ్రరీనా?" ఆశ్చర్యపోయాను.

"యా. కేంపస్‌కి అటువైపుంటుంది. అక్కడ ఒక ఫ్లాగ్ కనిపిస్తుంది చూడు. దాని పక్కన బిల్డింగ్."

మ్యూజిక్ లైబ్రరీ అంటే నేను ఏం పనిచెయ్యాలో ఏంటో అంటూ కాస్త భయపడ్డాను. కొన్ని సెకండ్ల తరవాత "నాకు సంగీతం రాదు" సిగ్గుపడుతూ చెప్పాను.

"నేను చిన్నప్పుడు నేర్చుకున్నాను. మా నాన్న ఇష్టంలేదన్నా కొట్టి మరీ పంపారు" బదులిచ్చింది. వెంటనే నేను అలా ఎందుకన్నానో అర్థమై" నిన్ను పాడమని అడగరులే" నవ్వింది.

లైబ్రరీ లోపల నుండి మామూలుగానే ఉంది పుస్తకాలు, టేబుల్స్ సాధారణ లైబ్రరీలానే ఉన్నాయి కానీ చిన్నది. లోపలకి నడిస్తే ఓ గదిలో కొన్ని ఇన్స్ట్రుమెంట్స్ ఉన్నాయి.

"ఇవి కూడా రెంట్ తీసుకోవచ్చా?" అడిగాను.

"డిపెండ్స్. పియానో ఇక్కడే ఉంటుంది. వైలిన్‌లాంటివి తీసుకోవచ్చు. చాలామంది ఇక్కడ అద్దెకి తీసుకుని క్లాస్‌కి వెళతారు" వివరించింది.

"అబ్బో. బాగానే ఉంది."

"కావాలంటే నువ్వు కూడా తీసుకోవచ్చు."

"నేను మ్యూజిక్ స్టూడెంట్ కాదు"

"లైబ్రరీ కార్డ్ ఉంటే చాలు. కాంపస్‌లో అన్ని లైబ్రరీలకి ఒకటే ఐడి."

"ఔనా. సరే"

అక్కడ పుస్తకాలు సంగీతంకి సంబంధించినవి మాత్రమే. చాలా చిన్న కలెక్షన్. నేను ఆశక్తిగా పండిట్ రవిశంకర్‌కి సంబంధించిన పుస్తకాన్ని చేతిలోకి తీసుకోగానే "పద, వెళ్ళి కలుద్దాము" అంది.

నిరాశగా పుస్తకాన్ని కిందపెట్టి తన వెంట నడిచాను.

"ఇతను సాయి కిరణ్. సాయి, తను న్యూ బాచ్. నీ జాబ్ రికమెండ్ చేస్తావా?" అడిగింది.

"ఒక్క టు అవర్స్ ముందు రావాల్సింది. ఇందాక నా బాస్‌తో మాట్లాడుతూ ఇంకో అబ్బాయిని రికమండ్ చేసాను" బదులిచ్చాడు.

"ఇందాక అదే మాట్లాడుతున్నావా?" ఎదురు ప్రశ్న అడిగింది.

"ఔను. ఇంక వెళ్ళే ముందు ఒక్కసారి కలిస్తే చాలు."

నా వైపు చూసి "ఇందాక బ్లూ షర్ట్‌లో ఒకావిడ వెళ్ళింది కదా, తనే వీళ్ళ ఇన్‌చార్జ్. ఎప్పుడో ఒక్కసారి వస్తుంది, అంతే."

అందుకే బయట పుస్తకాలు చూస్తూ కాలక్షేపం చేసింది కాబోలు.

"సరే, మళ్ళీ కలుద్దాం" ఇద్దరం బయటకి వచ్చాము.

మళ్ళీ కాసేపు నిశ్శబ్దంలో నడిచాక, "నువ్వు ఓకేనా?" అడిగాను.

"యా. నువ్వు?"

"నేను ఓకే."

"ఏమైనా కావాలా?"

"లేదు"

"మొహమాట పడకు"

"సరే"

ఓ నిమిషం తరవాత నేను ఎందుకు అడిగానో అర్థమైనట్టు నావంక చూసి, "థాంక్స్ ఫర్ ఆస్కింగ్. నేను ఓకే" నవ్వింది.

తెలుసుకోవాలని కుతూహలంగా ఉన్నా, అడిగితే బావుండదని నిన్న ఎందుకు ఏడ్చిందో అడగలేదు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story